# హెల్ప్! హెల్ప్!

వాయుగుండాలు సముద్రాల్లోనే కాదు సంసారాల్లో గూడా అవతరిస్తూ వుంటాయ్. వంట గదిలో ఏర్పడిన వాయుగుండం ఉత్తర దిశగా పయనించి పడగ్గదివైపో, దక్షిణ దిశగా ప్రయాణించి పెరటు గుమ్మాలవైపో దారి తీస్తాయ్. పడగ్గది వైపు పయనించే వాయుగుండాలు కొంతలో కొంత నయం. వీటివల్ల ప్రాణ నష్టం కలగదు గాని, వస్తు నష్టం, సుఖహరణం జరుగుతూ వుంటాయ్. ప్రకృతి వల్ల వచ్చి పడే వాడుగుండాలకి శాటిలైటు ఫోటోలు, వాతావరణ సూచనలు , వుంటాయి గాని వంటగది వాయుగుండాలకి ఈ సదుపాయం లేకపోవటం చేత మగవాళ్ళు సముద్రంలో చేపలు పట్టే వారి లాగా చాలా అప్రమత్తంగా వుండాలి.ఏమాత్రం అజాగ్రత్తగా వున్నా మా కేశవరావులాగా వరదల్లో చిక్కుకుపోయి హెలికాప్టర్లోంచి విసిరే సాంబారు పొట్లాల కోసం ఎదురు చూసే తుపాను బాధితులలాగా బ్రతకాల్సి వుంటుంది.

కేశవరావు పెళ్ళికి పూర్వం పచ్చగా పళ్ళ గంపలాగా వుండేవాడు. రెండేళ్ళల్లోనే జీర్ణం అయిపోయిన అంగవస్త్రంలా తయారైనాడు. ఒక సినిమా లేదు, నాటకం లేదు. మాటామంచి లేవు. మందూ మాకూ అస్సల్లేవు. మర మనిషిలాగా రావటం పోవడం తప్ప వులుకూపలుకూ కనిపించివు. ఇంతకీ ఏవిటి కారణం అని ఆరాతీయగా తెల్సిన విషయం ,ఇతగాడి మీద భార్యకి అనుమానమట. ఆలస్యంగా వస్తే ఎక్కడి నించి రావడం అని, ముందుగా వస్తే అసలు ఆఫీసుకే పోలేదాని, వీధి గుమ్మంలో నిల్చుంటే మేడపైన పిల్ల కోసమాని, దొడ్లో తలదాచుకుందామంటే , పని పిల్ల కోసమాని ప్రతి క్షణం పీక్కు తింటుందిట. ఈ నరకాన్ని భరించలేక అతను చాలా తీవ్రంగా ఆలోచించాట్ట. రెండే రెండు మార్గాలు అతనికి రైలు పట్టాల్లా కనిపించాయట. ఒకటి ఆవిడ అనుమానాన్ని నిజం చేస్తూ విజృంభించి వీధికెక్కటం. రెండు ఆయుధ విసర్జన చేసిన డెకాయిట్లాగా సరండ్రయిపోవటం. బాగా ఆలోచించిన మీదట రెండో మార్గమే వుత్తమమైనది, మరియు ఆరోగ్యవంతమైనది అనిపించటం చేత బాద్రపద శుద్ధ తదియ , గురువారం సాయంత్రం సమయం ఆరు ముప్పయి నిమిషాలకు మిధున లఘ్నమేషరాశి పుష్కరాంతశమందు భార్యకి తనని తాను అర్పించకుని ఆరిపోయిన అగరవత్తులాగా జీవిస్తున్నాడు.

ఈ మధ్యన అదేదో మహానగరంలో కేశవరావులాంటి భార్యాపీడిత భర్తలందరూ కల్సి ఒక యూనియన్ ఏర్పాటు చేసుకున్నారట. వాళ్ళకో రాజ్యాగం , ఎన్నికలు , మళ్ళీవాళ్ళల్లో అతి వాదులు , మితవాదులు . అతివాదులు అతివల అంతం చూడాలని పట్టుపడితే, మితవాదులు సంసారం పాడుకాకుండా తమకేదైనా రక్షణ కల్పించాలని వాదిస్తారట. ఒకరోజు యూనియన్ సర్వసభ్య సమావేశానికి ఇంకా పెళ్ళి కాని ఓ బ్రహ్మచారి మంత్రిని ఆహ్వానించారట. సమావేశం జరుగుతుండగా, కుట్ర కనిపెట్టిన కులసతులు చీపుళ్ళు, గరిటెలు , అప్పడాలకర్రలతో దండెత్తి వచ్చేసరికి ఆ దెబ్బ తెలీని మంత్రిగారు హడలెత్తిపోయి. " నాకేం తెలీదు, నాకేం తెలీదం " టూ వెనక్కి తిరిగి చూడకుండా పారిపోయేట్ట. దండెత్తి వచ్చిన స్త్రీ శక్తి సైనికులు తమ పర అనే తరతమ భేదం లేకుండా దొరికిన వార్ని దొరికినట్టు చితకబాది వదిలేరట. దొరికిపోయిన వాళ్ళల్లో యూనియన్ ప్రెసిడెంటు, జాయింటు సెక్రటరీ కూడా వున్నారు. తర్వాత భార్యల దమన నీతిని ఖండిస్తూ యూనియన్ సెక్రట్రి మారువేషంలో టీవీలో ప్రసంగించారు

అయినా ఆడదానికి రక్షణ కల్పించాలని సమాన హక్కులు కల్పించాలని, అటు ప్రభుత్వం ఇటు స్వచ్ఛంద సేవా సంస్ధలు పాటు పడుతున్నారే గాని, అన్యాయం అయిపోయిన మగవాళ్ళ గురించి పట్టించుకునే నాధుడే లేకుండా పోయారు. ఎదరొడ్డి పోరాడ లేనపుడు , చిర్నవ్వుతో అపజయాన్ని ఆహ్వానించమని ఇంగ్లీషు రచయిత చెప్పినట్టు – కేశవరావు అవలంభించిన పద్దతే కరెక్టు. మే గాడ్ సేవ్ హిజ్ స్కిన్ ..

------- అయ్యిపోయింది -------